సాక్షి గుంటూరు

బుధవారం । 19 । ఏప్రిల్ । 2023



పవర్ లిఫ్టింగ్‌లో పతకాలు


తెనాలి అర్బన్: నేషనల్ లెవల్ కోర్సు టెస్ట్‌లో క్రీడాకారులు జి.సాయితేజ, పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం, షేక్ అబ్దుల్లా వెండి పతకాన్ని సాధించారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: స్థానిక మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.6800, మోడల్ ధర రూ.5200 వరకు పలికింది.

రెండు కరోనా కేసులు



గుంటూరు మెడికల్ : గుంటూరు జిల్లా వ్యాప్తంగా మంగళవారం రెండు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గుంటూరు నగరంలోని కొరిటెపాడు, నగరాలలో ఒక్కొక్కటి చొప్పున కేసులు వచ్చాయి. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించ లేదు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహర్ (గురు)
గుంటూరు	6:29	4:32
నరసరావుపేట	6:31	4:29
బాపట్ల	6:29	4:32

న్యూస్‌రీల్

మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు

మార్క్‌ఫెడ్ డీఎం కృష్ణారావు

కొరిటెపాడు(గుంటూరు): 2022–23 రబీలో పండించిన మొక్కజొన్న పంటను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గుంటూరు జిల్లాలో 64,960 ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. ఎకరాకు సుమారు 26 క్వింటాళ్ల చొప్పున 1,68,896 టన్నుల దిగుబడి వచ్చింది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాళ్లకు రూ.1,962 ఉండగా.. మార్కెట్‌లో రూ.1,600 నుంచి రూ.1,800 వరకు మాత్రమే పలుకుతోంది. ఈ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా మద్దతు ధరతో కొనుగోలు చేయడానికి ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌కు అనుమతి ఇచ్చింది. రబీలో మొక్కజొన్న సాగు చేసి ఈ–క్రాప్ నమోదు చేయించుకోవడంతో పాటు ఈ–కేవైసీ చేయించుకున్న రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రంలో పేర్లు నమోదు చేయించుకున్న రైతులు మద్దతు ధరతో మొక్కజొన్న పంటను అమ్ముకోవచ్చని జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ ఆర్.జె.కృష్ణారావు తెలిపారు. ఇందుకోసం రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మంగళవారం ఆయన 'సాక్షి'కి వివరించారు.

యార్డులో 1,25,733 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,22,641 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,25,733 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 95,184 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

లక్ష్యసాధన దిశగా విధులు నిర్వర్తించాలి

జాయింట్ కలెక్టర్ శ్రీధర్



రేపల్లె రూరల్: ప్రభుత్వ లక్ష్యాలను సాధించే విధంగా సచివాలయ ఉద్యోగులు పని చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీధర్ కోరారు. పట్టణంలోని 8, 10 వార్డుల సచివాలయాన్ని మంగళవారం సాయంత్రం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలించారు. ప్రతిరోజు సచివాలయాల్లో స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించాలన్నారు. సచివాలయ పరిధిలో పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ మల్లికార్జునరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 525.00 అడుగుల వద్ద ఉంది. ఇది 158.5500 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 5,088, ఎడమకాలువకు 5,018, ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 11,906 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 3,142 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.70 అడుగుల వద్ద ఉంది. ఇది 31.3963 టీఎంసీలకు సమానం.

భగ భగలు..బహుపరాక్

- జిల్లాలో పెరుగుతున్న ఎండలు, వడగాడ్పులు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యాధికారులు
- వైద్య ఆరోగ్యశాఖ వేసవి ప్రణాళిక



గుంటూరు మెడికల్: తట్టుకోలేని ఎండలు, తీవ్రమైన వడగాలులతో గుంటూరు జిల్లా ప్రజలు అల్లాడిపోతున్నారు. కొద్దిరోజులుగా జిల్లాలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదు అవుతున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా ఎండలు నమోదయ్యే రెంటచింతల ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ఉండటంతో వడదెబ్బ మరణాలు సంభవించే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొద్దిపాటి సలహాలు, సూచనలు పాటించి వడదెబ్బ నుంచి ప్రాణాలు కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. వడదెబ్బ మరణాల నివారణ కోసం అవగాహన కల్పించేందుకు 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

వడదెబ్బను ఇలా గుర్తించండి...

మానవ శరీరంలో ఐదు లీటర్ల మేరకు నీరు ఉంటుంది. శరీరంలో జరిగే అన్ని జీవ క్రియలకు ఇది అత్యవసరం. శరీరంలో ఉష్ణోగ్రత 37 డిగ్రీలు(98.6 ఫారెన్‌హీహీట్) ఉంటుంది. బయటి వాతావరణంలో ఉష్ణోగ్రత 37 డిగ్రీలు దాటినప్పుడు మన శరీరం ఎండ ప్రభావానికి లోనవుతుంది. అప్పుడు ఉక్కపోతగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఆ సమయంలో శరీరం చల్లబడేందుకు అసంకల్పిత ప్రతీకార చర్యగా శరీరంలోని నీరు బయటకు వచ్చి సమతా స్థితిని చేరుకుంటుంది. చెమట బయటకు రాకున్నా శరీరంలోని నీరు శ్వేధ గ్రంధుల ద్వారా ఆవిరి అవుతూనే ఉంటుంది. దీనిని మనం గుర్తించలేము. ఇలా బయటకు వెళ్లిన నీటిని ఎప్పటికప్పుడు భర్తీ చేయాల్సిందే. ఆలస్యమయ్యే కొద్దీ జీవక్రియలు మందగిస్తాయి.

వడదెబ్బ లక్షణాలు..

శరీర ఉష్ణోగ్రత పెరగటం, వణుకు పుట్టడం, తలనొప్పి, తలతిరగటం, శరీరంలో నీరు అంతా పోతుంది. ఎండిపోయిన చర్మంతో ఎక్కువ జ్వరం కలిగి ఉండటం, మత్తు నిద్ర, కలవరింతలు, జ్వరం 106 డిగ్రీలు దాటగానే ఫిట్స్ వస్తాయి. దాని ద్వారా పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితిలోకి వెళ్తాడు. బీపీ పూర్తిగా తగ్గిపోతుంది. బ్రెయిన్, కిడ్నీలు ఫెయిల్ అవుతాయి, మూత్రం స్తంభించి ప్రాణాలు పోతాయి.

చేయకూడని పనులు

- మండు వేసవిలో, తీవ్ర ఉష్ణోగ్రత ఉన్న సమయంలో బయట తిరుగకూడదు
- సూర్య కిరణాలకు, వేడి గాలికి గురి కాకూడదు
- రోడ్ల మీద చల్లని, రంగు పానీయాలు తాగకూడదు
- రోడ్లమీద అమ్మే కలుషిత ఆహారం తినకూడదు
- మాంసాహారం తగ్గించాలి.. మద్యం సేవించకూడదు
- ఎండ వేళల్లో శరీరంపై భారం పడే శ్రమగల పనులు చేయకూడదు.
- నలుపు దుస్తులు, మందంగా ఉన్న దుస్తులు ధరించకూడదు

వైద్యాధికారులను అప్రమత్తం చేశాం...

వేసవి ఎండలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను, వైద్య సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించాం. గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లలు ఎండ ప్రభావానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశాం. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. బాధితులకు వైద్యం అందించేందుకు ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, యాంటీ డయేరియల్ మందులు సిద్ధం చేసి ఉంచాం.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

వడదెబ్బ తగలకుండా ఉండాలంటే...

- సాధ్యమైనంత వరకు మిట్ట మధ్యాహ్నం ఎండలో తిరగకుండా జాగ్రత్త వహించాలి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంట్లో ఉండటం చాలా మంచిది.
- తప్పని సరిగా బయటకు వెళ్లాల్సి వస్తే ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మ రసం, పళ్ల రసాలు తాగి బయలుదేరాలి.
- భోజనం మితంగా తినాలి. రెండు పూట్ల శుభ్రంగా స్నానం చేయాలి.
- తెల్లని దుస్తులు, లేత రంగులు ఉన్న వస్త్రాలు ధరించాలి. బాగా వదులుగా ఉండే కాటన్ వస్త్రాలు ధరిస్తే మంచిది. నల్లని వస్త్రాలు ధరించకూడదు.
- కిటికీలకు, తలుపులకు తెరలను వాడి, ఇంటిగదుల ఉష్ణోగ్రతను తగ్గించవచ్చు. ఫ్యాన్లు, ఎయిర్‌కూలర్లు, ఎయిర్ కండీషనర్లు వాడాలి.
- శీతలంగా ఉన్న ప్రదేశాలలో ఉండేందుకు ప్రయత్నించాలి
- వేడిగా ఉన్న రోజులలో తప్పని సరిగా గొడుగు, నెత్తికి టోపీ లేదా రుమాలు కట్టుకోవటం చేయాలి
- శరీరం నుంచి చెమట రూపంలో నీరు ఎక్కువగా బయటకు పోతుంది. కాబట్టి సాధ్యమైనంత మేరకు మంచినీరు ఎక్కువగా తాగాలి. కనీసం ఐదు లీటర్లు నీటిని తాగితే మంచిది
- ఎండలో పొలం పనులకు వెళ్లకూడదు. ఒక వేళ ఏమైనా పనులు చేయాల్సి వస్తే ఉదయం, సాయంత్రం వేళల్లో చేయాలి

శుభమస్తు

కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ పాలకవర్గ వివాదానికి తెర

- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి జోక్యంతో నూతన కమిటీ ఏర్పాటుకు మార్గం సుగమం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆహ్వానం

నెహ్రూనగర్: కోర్టుల చుట్టూ తిరుగుతున్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కమిటీ వ్యవహారం ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి జోక్యంతో కొలిక్కివచ్చింది. దీంతో నూతన కమిటీ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. వివరాల్లోకి వెళితే...

గుంటూరు నగరంలోని ప్రముఖ దేవాలయాల్లో శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఒకటి. ఆర్.అగ్రహారం కేంద్రంగా గుంటూరుకు తలమానికమే కాకుండా ప్రత్యేకించి ఆర్యవైశ్య సామాజిక వర్గానికి ఈ ఆలయం పరమ పవిత్రమైన పుణ్యధామంగా విరాజిల్లుతోంది. అత్యంత మహిమాన్వితురాలిగా అందరూ విశ్వసించే అమ్మవారిని నిత్యం తలిచి కొలిచి తరిస్తుండడం వారికి అనాదిగా వస్తోంది. ప్రధానంగా మహిళలు ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడాన్ని ఒక సెంట్‌మెంట్‌గా భావిస్తుంటారు. దీంతో ఆలయ ప్రాశస్త్యం దినదినాభివృద్ధి చెంది దేశ విదేశాల్లో సైతం పేరు ప్రఖ్యాతులు పొందింది. తద్వారా విశేషమైన కీర్తికాంతులతో పాటు ఆలయ కమిటీ చుట్టూ విపరీతమైన ఆరోపణలు కూడా చుట్టుముట్టాయి.

అమ్మవారి దేవస్థానంలో కమిటీ పెత్తనం బాగా మితిమీరిందనీ, ఆలయం కమిటీ సభ్యుల ఇష్టారాజ్యంగా మారిందనీ, వారు ఆడిందే ఆట, పాడిందే పాట అనీ... ఇలా బోలెడన్ని ఆరోపణలు, వాటికి దేవస్థానం కమిటీ ప్రత్యారోపణలతో గుంటూరు నగరం మార్మోగిపోయింది. దీనిపై ఆర్యవైశ్య పెద్దలు, రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు ఎందరో జోక్యం చేసుకుని వ్యవహారాన్ని సర్దుబాటు చేద్దామని చూసినా అది చినికిచినికి గాలివానే అయింది తప్ప వివాదం సర్దుమణగ లేదు.

ఈ క్రమంలో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు మహ్మద్ ముస్తఫా, మద్దాళి గిరి, గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఆర్యవైశ్య ప్రముఖులు



కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం (ఫైల్)

కోరిన మీదట ఎమ్మెల్సీ అప్పిరెడ్డి జోక్యం చేసుకుని ఆలయ వివాదంతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ బృందావన్ గార్డెన్స్‌లోని తన క్యాంపు కార్యాలయానికి పిలిపించి, చర్చించి ఎట్టకేలకు వివాదానికి తెరదించారు.

2014లోనే కోర్టు స్టే తెచ్చుకున్న మేడా సాంబశివరావు, తాజాగా స్టే తెచ్చుకున్న దేవరశెట్టి చిన్నిలతో ప్రత్యేకంగా మాట్లాడి వివాదానికి ముగింపు పలికారు. అంతేకాక వారిద్దరితో కోర్టులో కేసులు ఉపసంహరించడంతో నూతన కమిటీ ఏర్పాటుకు ఒక చక్కటి పరిష్కారం లభించినట్లయ్యింది. ఈ నేపథ్యంలో శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మ వారి దేవస్థానం నూతన కమిటీ నియామకానికి సంబంధించిన దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతూ ఆన్‌లైన్లో 13వ తేదీన నోటిఫికేషన్ విడుదలైంది. ఆసక్తి గల వారు నోటిఫికేషన్ విడుదలైన 20 రోజుల గడువులో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కూడా కల్పించారు.

ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చాలా కాలం తర్వాత నియమనిబంధనలకు అనుగుణంగా ఒక నూతన కమిటీ ఏర్పడేందుకు మార్గం సుగమం కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

ఇళ్ల నిర్మాణానికి సరైన సమయమిది

- జగనన్న కాలనీల్లో వెంటనే పనులు చేపట్టండి
- కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లోని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు మంచి సమయమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు అవగాహన కల్పించడంతోపాటు ఆప్షన్–3 నిర్మాణ ఏజెన్సీలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. నిర్మాణాలకు కావల్సిన నీటి సౌకర్యాలను మున్సిపాలిటీ, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగాలు చూసుకోవాలన్నారు. కాలనీల్లో వేసిన బోర్లు పని చేయకపోతే వెంటనే బాగు చేయాలన్నారు. ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు మంచినీటి కుళాయి, విద్యుత్, కనెక్షన్ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, హౌసింగ్ పీడీ సాయినాథ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎస్ఏ-2

- వార్షిక పరీక్షలకు సిద్ధమైన పాఠశాలలు
- ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఏ విధానంలో నిర్వహణ
- ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఓఎంఆర్ షీట్లతో పరీక్షలు
- 9వ తరగతి విద్యార్థులకు గతంలో మాదిరిగా ప్రశ్నపత్ర విధానం
- మూడు జిల్లాల్లో ఎంపిక చేసిన ప్రైవేటు పాఠశాలలకు సీబీఏ విధానంలో పరీక్షలు
- ఉదయం 8 గంటలకే ప్రారంభం



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్నాయి. సమ్మెటివ్ అసెస్‌మెంట్–2 (ఎస్ఏ) పరీక్షల్లో విద్యార్థుల ప్రగతి కొలమానం కానుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) రూపొందించిన ఉమ్మడి ప్రశ్నపత్రం ద్వారా పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఏ విధానంలో పరీక్షలు

ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు క్లాస్‌రూం బేస్డ్ అసెస్‌మెంట్ (సీబీఏ) ద్వారా ఓఎంఆర్ షీట్ విధానంలో పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణలో నూతన విధానాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం, విద్యార్థుల మేధస్సుకు పదునుపెట్టి ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా సీబీఏ విధానంలో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. కాగా ప్రస్తుత విద్యాసంవత్సరంలో వరుసగా మూడోసారి సీబీఏ–3 పరీక్షలు నిర్వహిస్తోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సీబీఏ–3 పరీక్షల్లో భాగంగా ఓఎంఆర్ షీట్ ఇవ్వనున్నారు.

ఎనిమిది వేల మందికి సీబీఏ విధానం

ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు తరగతికి వెయ్యి మంది చొప్పున విద్యార్థులకు సీబీఏ విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ విధంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ప్రతి జిల్లాకు ఎనిమిది వేల మంది చొప్పున విద్యార్థులు సీబీఏ విధానంలో పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పాత విధానంలోనే విద్యాశాఖ ప్రశ్నాపత్రంతో పరీక్షలు నిర్వహిస్తోంది.

రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) ముద్రించిన ఉమ్మడి ప్రశ్నపత్రాలతోనే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. గుంటూరులోని ఉమ్మడి పరీక్ష నిర్వహణ మండలి (డీసీఈబీ) ద్వారా ముద్రించిన ప్రశ్నపత్రాలను పాఠశాలలకు పంపించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 3,571 ప్రభుత్వ పాఠశాలల పరిధిలో 3.50 లక్షల మంది విద్యార్థులతో పాటు 1,200 ప్రైవేటు పాఠశాలల్లో మరో 2.50 మందికి ఎస్ఏ–2 పరీక్షలు జరగనున్నాయి.

ఉదయం 8 గంటలకే..

ఎండల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం ఎస్ఏ–2 పరీక్షల వేళల్లో మార్పులు చేసింది. ఈనెల 20 నుంచి 29వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఒకటి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు ఉదయం 8.00 గంటల నుంచి 11 గంటల వరకు, 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 8.00 గంటల నుంచి 11.15 వరకు పరీక్షలు జరగనున్నాయి.

గ్రామీణ విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యం

- అకడమిక్ సెనేట్‌లో వీసీ రాజశేఖర్
- రూ.300.94 కోట్ల వార్షిక బడ్జెట్‌కు ఆమోదం
- 287 అధ్యాపక పోస్టుల భర్తీ ప్రతిపాదనకు ఆమోదం
- పలు నూతన కోర్సుల ప్రారంభానికి ఆమోదం



యూనివర్సిటీ ప్రగతిని వివరిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్

ఏఎన్‌యూ: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక, సాంప్రదాయ విద్య, పరిశోధనలు అందించడమే లక్ష్యంగా ఏఎన్‌యూలో చర్యలు తీసుకుంటున్నామని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ వెల్లడించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 86వ అకడమిక్ సెనేట్ సమావేశం మంగళవారం యూనివర్సిటీలో జరిగింది. సమావేశంలో వీసీ అధ్యక్షోపన్యాసం చేస్తూ గత ఆరు నెలల్లో యూని వర్సిటీలో జరిగిన సమగాభివృద్ధిని వివరించారు. యూనివర్సిటీలో గత మూడు నెలల్లో 65కు పైగా జాతీయ సదస్సులు జరిగాయని, భారత్‌తోపాలు పలు దేశాలకు చెందిన నిపుణులు, మేధావులు ఈ సదస్సులలో పాల్గొన్నారని తెలిపారు. మారుతున్న పరిస్థితులు, సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు ఉపాధి అవకాశాలు పొందేందుకు దోహదం చేసే నూతన కోర్సులను ప్రవేశ పెట్టడంతోపాటు, ఉపాధి సంబంధిత నైపుణ్య లక్షణాల పెంపొందింపునకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పరిశోధనలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. యూనివర్సిటీలో విధులు నిర్వహిస్తున్న ప్రతి అధ్యాపకుడికి రెండు లక్షల రూపాయల సీడ్ ఫండ్‌ను కేటాయిస్తున్నామన్నారు. వీటిని పరిశోధనల కోసం అధ్యాపకులు వినియోగించాల్సి ఉంటుందన్నారు. పరిశోధకులకు ఫెలోషిప్స్ ఇచ్చే కార్యక్రమాన్ని కూడా త్వరలో ప్రారంభిస్తున్నామని తెలిపారు.


రూ. 300.94 కోట్ల వార్షిక బడ్జెట్‌కు ఆమోదం

యూనివర్సిటీ 2023–24 వార్షిక బడ్జెట్‌ను రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి ప్రవేశ పెట్టారు. యూనివర్సిటీ మొత్తం బడ్జెట్ రూ. 300.94 కోట్లు కాగా రాబడి రూ. 297.77 కోట్లుగా ఉంది. రూ. 3.17 కోట్లు లోటు బడ్జెట్‌గా పొందుపరిచారు. ఈ బడ్జెట్‌కు అకడమిక్ సెనేట్ ఆమోదం తెలిపింది. యూనివర్సిటీలో ప్రారంభించనున్న ఎంబీఏ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఎంఏ అప్లయిడ్ లింగ్విస్టిక్స్, బ్యాచులర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, ఎమ్మెస్సీ ఫారెస్ట్రీ, ఎమ్మెస్సీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ పొల్యూషన్ కంట్రోల్, మాస్టర్ ఆఫ్ ఫెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఇన్ థియేటర్, సినిమా, ఎంఏ మ్యూజిక్, ఎంఏ డాన్స్ ఎంబీఏ మీడియా మేనేజ్‌మెంట్, బీఏ డాన్స్ తదితర కోర్సులకు అకడమిక్ సెనేట్ ఆమోదం లభించింది. సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, మాజీ వీసీలు ఆచార్య వై.ఆర్. హరగోపాల్‌రెడ్డి, ఆచార్య వి.బాలమోహన్‌దాస్, పలువురు పాలకమండలి సభ్యులు, అకడమిక్ సెనేట్ సభ్యులు పాల్గొన్నారు.

20 నుంచి సలహా మండలి సమావేశాలు

గుంటూరు రూరల్: లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో ఈనెల 20, 21వ తేదీలలో కృష్ణ మండలం వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాలను నిర్వహించనున్నట్లు సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ జి. సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలలో గుంటూరు, కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లా, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, అనుబంధ రంగాల అధికారులు, రైతులు, మహిళా రైతులు, పాల్గొంటారన్నారు. సమావేశాలలో రానున్న ఏడాదిలో చేపట్టాల్సిన కార్యాచరణ, తదితర అంశాలపై చర్చించటం జరుగుతుందన్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 216 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 0 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 58 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 102 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 0 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 122 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 420 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.

నాక్ అక్రిడిటేషన్ సాధించే స్థాయికి చేరుకోవాలి

కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్



మాట్లాడుతున్న కమిషనర్ పోలా భాస్కర్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు నాక్ అక్రిడిటేషన్ సాధించే స్థాయికి చేరుకోవాలని కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న పోలా భాస్కర్ మాట్లాడుతూ ఉన్నత విద్యామండలి ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంలో భాగంగా ఐదు రకాల కొత్త యాప్స్ గురించి వివరించారు. విద్యలో ఆధునిక బోధనా పద్ధతులు, నూతన సంస్కరణలతో కూడిన యాప్స్‌ను ప్రభుత్వ కళాశాలలే వినియోగిస్తున్న క్రమంలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఎయిడెడ్ కళాశాలలు సైతం యాప్స్ వినియోగించాలని సూచించారు. కళాశాలలో విద్యార్థుల ప్రవేశాలు పెరిగేందుకు చేపట్టాల్సిన చర్యలు, ఆధునిక విద్యాబోధనకు అనుసరించాల్సిన వ్యూహాలను సమీక్షించారు. సమావేశంలో ఆర్జేడీ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, ఏజీవో తులసీ మస్తానమ్మ, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న స్కూల్ బస్
- వెనుక నుంచి వచ్చి.. మరో లారీ ఢీ
- విద్యార్థులంతా క్షేమం



ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన స్కూల్ బస్సు

అద్దంకి: స్కూల్ బస్సును వెనుకగా లారీ ఢీ కొట్టిన ఘటనలో ప్రమాదం త్రుటితో తప్పింది. విద్యార్థులంతా క్షేమంగా ఉండటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన సంతమాగులూరు మండలంలోని సంతమాగులూరు–బల్లికురవ రోడ్డులో మంగళవారం జరిగింది. ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు చెందిన బస్సు విద్యార్థులను ఎక్కించుకుని బల్లికురవ వైపు వెళ్తోంది. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సును వెనుకగా ఢీ కొట్టింది. వెనుకగా వస్తున్న లారీ స్కూల్ బస్సును ఢీ కొట్టింది. అయితే డ్రైవర్ల అప్రమత్తతో షడన్ బ్రేక్‌లు వేయడంతో బస్సుల్లో ప్రయాణిస్తున్న విద్యార్థులంతా క్షేమంగా ఉన్నారని తెలుసుకున్న స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. మూడు వాహనాలు రోడ్డులో నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు.

'ఆహ్వానం' లక్ష్మి ఇకలేరు


ఎస్ఎస్ లక్ష్మి (ఫైల్)

తెనాలి: ప్రముఖ రచయిత, ఆహ్వానం మాసపత్రిక సంపాదకురాలు సమయం సామ్రాజ్యలక్ష్మి (74) హఠాన్మరణం చెందారు. ఆహ్వానం లక్ష్మిగా, ఎస్ఎస్ లక్ష్మిగా సాహితీ ప్రపంచానికి చిరపరిచితులైన లక్ష్మి, కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఉన్నారు. కార్డియాక్ అరెస్టుతో సోమవారం మృతి చెందారు. దివంగత అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రామారావు ఆమె భర్త. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మెట్రిక్యులేషన్ మాత్రమే పూర్తిచేసిన లక్ష్మికి సాహిత్యంపై ఎనలేని అభిమానం. 'కళాతపస్వి' సంజీవదేవ్‌తో లేఖాసాహిత్యం చేశారు. సంజీవదేవ్‌పై అభిమానంతో తన కుమారుల్లో ఒకరికి ఆయన పేరుతో నామకరణం చేశారు. చలం సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. విజయవాడ, తెనాలి, గుడివాడల్లో సాహిత్య గోష్ఠులు నిర్వహించారు. సాహిత్య కార్యక్రమాల్లో మునిగితేలుతూ 'భారతి' పత్రిక స్థాయిలో సాహిత్య పత్రికను తీసుకురావాలనే తలంపుతో విజయవాడ కేంద్రంగా 'ఆహ్వానం' మాసపత్రికను స్థాపించారు. సాహిత్య విలువలతో 15 ఏళ్లపాటు నడిపారు. ప్రతి నెలా సంపాదకీయాన్ని తానే రచిస్తూ వచ్చారు. సాహితీప్రపంచం ఆదరణ పొందినా, ఆర్థికంగా నష్టపోవడంతో చివరకు మూసేయక తప్పలేదు. విజయవాడలోని రుద్రభూమిలో మంగళవారం లక్ష్మి అంత్యక్రియలు పూర్తిచేసినట్లు సోదరుడు బీజే ఆర్‌కే తెలియజేశారు.

ఖననం చేసిన రెండున్నర నెలలకు మృతదేహానికి పోస్టుమార్టం

కుమారుని మృతిపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదు చేసిన తల్లి

కర్లపాలెం: ఓ మృతదేహానికి ఖననం చేసిన రెండున్నర నెలల తర్వాత పోలీసులు పోస్టుమార్టం చేయించిన సంఘటన మంగళవారం కర్లపాలెంలో చోటుచేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ ఎం.అంజయ్య తెలిపిన వివరాలు..బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం కొత్త నందాయపాలెం గ్రామానికి చెందిన షేక్ బషీర్ బాషా కుమారుడు రెహ్మాన్(28)కి రిజ్వానాతో తొమ్మిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. కుటుంబ వివాదాల నేపథ్యంలో రెహ్మాన్ ఫిబ్రవరి 1వ తేదీన తన ఇంటిలో ఉరి వేసుకుని మృతిచెందాడు. అదేరోజు రెహ్మాన్ భౌతికకాయానికి కుటుంబసభ్యులు తమ ఆచారం ప్రకారం కర్లపాలెంలోని ముస్లింల శ్మశానవాటికలో ఖననం చేశారు. రెహ్మాన్ మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని అతని తల్లి సలీమున్నీసా ఈనెల 8వ తేదీన కర్లపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కర్లపాలెం తహసీల్దార్ జి.కేశవనారాయణరావు ఆధ్వర్యంలో బాపట్ల రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి పర్యవేక్షణలో గుంటూరు జీఎంసీ ఫోరెనిక్స్ ప్రొఫెసర్‌తో పోస్టుమార్టం చేయించామని ఎస్ఐ తెలిపారు. నివేదిక ప్రకారం కేసు దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

నాటిక పోటీలకు కొండవీటి కళాపరిషత్ సిద్ధం


21, 22, 23 తేదీల్లో లింగారావుపాలెంలో నిర్వహణ

యడ్లపాడు: కొండవీటి కళాపరిషత్ 24వ జాతీయస్థాయి నాటికల పోటీల నిర్వహణకు సిద్ధమైంది. యడ్లపాడు మండలం లింగారావుపాలెం జెడ్పీహైస్కూల్లోని పోసాని సుబ్బారావు స్మారక కళావేదిక ఈ ఉత్సవాలకు వేదిక కానుంది. వరుసగా మూడు రోజులు జరిగే ఈ పోటీలకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ కళాసంస్థల నుంచి తొమ్మిది అత్యుత్తమ తెలుగు సాంఘిక నాటికలు రానున్నాయి.

ప్రదర్శన వివరాలు...

21వ తేదీ రాత్రి నందమూరి కళా ప్రాంగణంలో.. మృత్యుంజయరావు రచనకు నాయుడు గోపీ దర్శకత్వం వహించిన గంగోత్రి(పెదకాకాని)వారి ''ఆస్తికలు'' నాటిక.

రాత్రి 10.30 గంటలకు వై.భాస్కరరావు రచనకు వై.ఎస్. కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహించిన రసఝురి (పొన్నూరు)వారి ''కాపలా'' నాటిక. రాత్రి 11.30 గంటలకు గుంటి రాజేశ్వరీ మూలకథకు తాళ్లబత్తుల వెంకటేశ్వరరావు నాటకీకరణ చేసి అమృతలహరి దర్శకత్వం వహించిన శ్రీ అమృత లహరి థియేటర్స్ ఆర్ట్స్ (గుంటూరు) వారి ''నాన్నా నేనొచ్చేస్తా'' నాటిక.



పోటీల నిర్వహణ లోగో

22వ తేదీ రాత్రి ఆలోకం సత్యనారాయణ కళా ప్రాంగణంలో..

పరమాత్ముని శివరాం రచనకు మంచాల రమేష్ దర్శకత్వం వహించిన చైతన్య కళాభారతి (కరీంనగర్) వారి ''చీకటి పువ్వు'' నాటిక. రాత్రి 10.30 గంటలకు కంచర్ల సూర్యప్రకాష్ రచనకు కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించిన కళాంజలి (హైదరాబాద్) వారి ''రైతేరాజు'' నాటిక. రాత్రి 11.30 గంటలకు సూదనగుంట వెంకటేశ్వర్లు రచనకు వై బుచ్చయ్య చౌదరి దర్శకత్వం వహించిన కళానికేతన్ (వీరన్నపాలెం) వారి ''స్థిరాస్తి'' నాటిక.

23వ తేదీ ఆదివారం రాత్రి స్వర్గీయ మురుకుట్ల రమేష్‌కుమార్ (రాము) కళా ప్రాంగణంలో..

మంజునాథ రచన, దర్శకత్వం వహించిన సిరి మువ్వ కల్చరల్ అసోసియేషన్ (హైదరాబాద్) వారి ''థింక్'' నాటిక. రాత్రి 10.30 గంటలకు పి.సత్యవతి మూలకథకు వల్లూరి శివప్రసాద్ నాటకీకరణ చేసి గంగోత్రిసాయి దర్శకత్వం వహించిన అరవింద ఆర్ట్స్ (తాడేపల్లి)వారి ''వెండిఅంచులు'' నాటిక. రాత్రి 11.30 గంటలకు విజయార్కె మూలకథకు రావి నాగేశ్వరరావు నాటకీకరణ చేసి గోపరాజు విజయ్ దర్శకత్వం వహించిన సాయిఆర్ట్స్ (కొలకలూరు) వారి ''ప్రేమతో నాన్న'' నాటిక.ఆయా పోటీల్లో ఉత్తమంగా నిలిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ ప్రదర్శనలకు నగదు బహుమతులు, కళాకారులకు జ్ఞాపికలు, ప్రతి నాటికకు ప్రదర్శన పారితోషికం, ప్రతి రచయిత, దర్శకుడు అలాగే ఉత్తమ రచయిత, ఉత్తమ దర్శకుడికి ప్రత్యేక నగదు బహుమానం, షీల్డు ఇవ్వనున్నట్లు పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు కట్టా శ్రీహరిరావు, మండెపూడి శ్రీనివాసరావు, సభ్యులతో కలిపి తెలిపారు.

కేబీఆర్ పార్కుకు దీటుగా టెంపుల్ హిల్ ఏకో పార్కు

- రెండు నెలల్లో పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి
- రాష్ట్రానికే మోడల్ పార్కుగా టెంపుల్ హిల్ ఏకో పార్కు
- పనులను పరిశీలించిన ఏపీసీసీఎఫ్ మధుసూదనరెడ్డి

మంగళగిరి: నగర ప్రజలకు ఆహ్లాదంతోపాటు ఆరోగ్యాన్ని అందించేలా నగర పరిధిలోని ఎయిమ్స్ ఆసుపత్రి పక్కన రెండు పచ్చని కొండల మధ్య ఆహ్లాదకర ప్రశాంత వాతావరణంలో టెంపుల్ హిల్ ఏకో పార్కు అభివృద్ధి పరుస్తున్నట్లు రాష్ట్ర అటవీశాఖ ప్రధాన అధికారి మధుసూదనరెడ్డి తెలిపారు. నగర పరిధిలోని గండాలయస్వామి కొండపైకి నూతనంగా ఏర్పాటు చేసిన ట్రెక్కింగ్ ట్రాక్‌లో మంగళవారం మధుసూదనరెడ్డి ట్రెక్కింగ్ నిర్వహించారు. అనంతరం టెంపుల్ హిల్ ఏకో పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులు, ముఖద్వారం సుందరీకరణ, యోగా సెంటర్‌ల నిర్మాణాలు, బాత్‌రూమ్స్, సెక్యూరిటీ రూమ్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెండవ అతి పెద్ద నగరంగా అవతరించిన మంగళగిరి–తాడేపల్లి శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని పిల్లలకు క్రీడలు, పెద్దలకు వాకింగ్, ట్రెక్కింగ్, వ్యాయామం చేసుకునేలా సకల వసతులతో టెంపుల్ హిల్ ఏకో పార్కు అభివృద్ధి పరచడం జరుగుతుందన్నారు. రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా మొట్టమొదటి పార్కు నగరంలో అభివృద్ధి చేస్తుండడంతో ప్రజలనుంచి విశేష ఆదరణ లభిస్తుందన్నారు. రానున్న రెండునెలలో పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచి హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కును తలిపించేలా ప్రజలకు అందుబాటులోకి తేవడం జరుగుతుందన్నారు. పార్కు అభివృద్ధితోపాటు గండాలయ స్వామి కొండపైకి ట్రెక్కింగ్ ట్రాక్ ఏర్పాటుతో నగరం పర్యాటక రంగంతోపాటు ఆధ్యాత్మిక నగరంగా పర్యాటకులను, సందర్శకులను ఆకట్టుకుంటుందన్నారు. ట్రెక్కింగ్‌కు వెళ్లే వారు విశ్రాంత్రి తీసుకునేందుకు ఆ మార్గంలో విశ్రాంతి బల్లలు, తాగునీరు, బాత్‌రూమ్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీసీఎఫ్ బికె సింగ్, డీఎఫ్‌వో మహబూబ్ బాషా, రేంజర్ శ్రీవిద్య, డిప్యూటీ రేంజర్ పొన్నవాడ గిరిబాబు, బీట్ ఆఫీసర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


గండాలయస్వామి కొండపైకి ఏర్పాటు చేసిన ట్రెక్కింగ్ ట్రాక్‌లో ట్రెక్కింగ్ చేస్తున్న రాష్ట్ర అటవీశాఖ ప్రధానాధికారి మధుసూదనరెడ్డి తదితరులు

బాబు, లోకేష్‌లు చేసిన ఒక్క అభివృద్ధి పనిని చూపించగలరా?

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



మంగళగిరి: గత ఐదు సంవత్సరాల పాలనలో మూడు శాఖల మంత్రిగా ఉన్న లోకేష్ కానీ, నియోజకవర్గంలో నివాసం ఉన్న చంద్రబాబు కానీ ఏనాడైనా మంగళగిరి నియోజకవర్గం ముఖం చూశారా, ఒక్క అభివృద్ధి పనైనా చేశారా అని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) నిలదీశారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో తిరిగి ఉంటే ప్రజల సమస్యలు తెలిసేవన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆందోళన చెందుతున్న లోకేష్, టీడీపీ నాయకులు కాలయాపన కోసం తనపై ఆరోపణలు చేసేందుకు కార్యక్రమాలు పెడుతున్నారన్నారు. లోకేష్ మంత్రిగా ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచివుంటే ఆయనను నియోజకవర్గ ప్రజలు ఎందుకు ఓడించారని ప్రశ్నించారు. టీడీపీ మాజీ ఇన్‌ఛార్జి పోతినేని శ్రీనివాసరావు నివాసంతోపాటు అదే ప్రాంతంలోని 1500 మంది నిర్వాసితుల ఇళ్లు 22–ఏ జాబితాలో చేరగా రిజిస్ట్రేషన్ లేక ఇబ్బందులు పడుతుంటే టీడీపీ పాలనలో ఎందుకు 22–ఏ జాబితా నుంచి తొలగించలేకపోయారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం 22–ఏ జాబితా నుంచి తొలగించేలా చేశామని, అందులో ఒక్క రూపాయి లంచం తీసుకున్నట్లు పోతినేని శ్రీనివాసరావు నిరూపించాలన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో అవినీతి లేకుండా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయనే విషయం టీడీపీ స్థానిక నాయకులకు తెలుసునని, మనసాక్షిని చంపుకుని లోకేష్ బాధ భరించలేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆరోపణలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వం ఇప్పటికే రూ.1400 కోట్లు సంక్షేమ పథకాలు అందాయన్నారు.

సంక్షేమంతోపాటు అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రూ.400 కోట్ల అభివృద్ధి పనులు నియోజకవర్గంలో చేపట్టి నిరంతరం పర్యవేక్షిస్తూ పనులు పూర్తి చేసేలా చూడడం జరుగుతుందన్నారు. పార్టీకి దూరంగా ఉన్నాననేది అపోహ మాత్రమేనని నిరంతం అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తూ నియోజకవర్గంలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేయడం జరుగతుందన్నారు.

లేగదూడలకు అందాల పోటీలు

ప్రారంభించిన జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు

మోదుకూరు(తెనాలి): రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం కింద జాతీయ కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించిన లేగదూడలకు అందాల పోటీలను నిర్వహించారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండల గ్రామం మోదుకూరులో మంగళవారం ఈ పోటీలను జరిపారు. పోటీలను జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు ప్రారంభించారు. వేమూరు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కేవీ జనార్ధనరావు సభకు అధ్యక్షత వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ డి.బాలశంకరరావు పశుపోషకుల నుద్దేశించి మాట్లాడుతూ కృత్రిమ పిండమార్పిడితో మేలుజాతి పశుసంతతిని ఒక తరంలోనే పొందవచ్చునని, లింగ నిర్ధారిత వీర్యం ద్వారా మేలుజాతి పెయ్యదూడలను పొందవచ్చని చెప్పారు. జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ నేటి పెయ్యదూడలే...రేపటి పాడిపశువులు అనే విషయాన్ని పశుపోషకులు గుర్తెరగాలని చెప్పారు. పశుసంవర్ధక శాఖ ద్వారా ఉచితంగా అందిస్తున్న గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను, బ్రూసెల్లోసిస్ వ్యాధి టీకాలను తప్పనిసరిగా పశువులకు వేయించాలని సలహానిచ్చారు. చుండూరు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఆళ్ల వెంకట రమణారెడ్డి తన ప్రసంగంలో పశుసంవర్ధకశాఖ అమలు చేస్తున్న పథకాలను రైతు సోదరులు వినియోగించుకుని లబ్ధి పొందాలని కోరారు. అనంతరం అందాల పోటీల్లో విజేతలైన పశుపోషకులకు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతిని పుట్ల రత్నం లేగదూడ గెలుచుకోగా, ద్వితీయ బహుమతి నల్లూరి ప్రసాద్, తృతీయ బహుమతి లీలీ ఫణీంద్రరెడ్డి అందుకున్నారు. అందాల పోటీల్లో మొత్తం 54 లేగదూడలు పాల్గొనటం విశేషం.


ప్రథమ బహుమతిని అందుకుంటున్న రైతు పుట్ల రత్నం

పోలీసులను అభినందించిన ఎస్పీ

నగరంపాలెం: ప్రతి ఒక్కరూ బాధితులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో విధులు నిర్వర్తించాలని గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో మంగళవారం తూర్పు డీఎస్పీ బి.సీతారామయ్య, హెడ్‌కానిస్టేబుల్ సిహెచ్.ఉదయ్‌ప్రకాష్, కానిస్టేబుళ్లు కె.ప్రసాద్, పి.శ్రీనివాసరావులకు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. గుంటూరు శారదా కాలనీకి చెందిన 16 ఏళ్ల బాలికను అదే ప్రాంతానికి చెందిన కె.కోటేశ్వరి అనే మేస్త్రీ లాలాపేట మేదరబజార్‌లో మామిడి పండ్ల దుకాణంలో కూలీ పనులకు తీసుకెళ్తుంది. వ్యాపారి బి.అర్జునరావు అలియాస్ అర్జున్ బాలికపై కన్నేయగా, అందుకు ఆమె నిరాకరించింది. దీంతో బాలికను తన వద్దకు పంపిస్తే రూ.500 చెల్లిస్తానని కోటేశ్వరికి వ్యాపారి చెప్పాడు. బాలిక నిరాకరించగా బలవంతంగా ఆమెపై పలుమార్లు వ్యాపారి లైంగిక దాడికి పాల్పడ్డాడు. 2017 మే 15న జ్వరంతో బాధపడుతున్న బాలికను వైద్యుడు పరీక్షించి, గర్భవతిగా నిర్ధారించారు. దీనిపై బాధితురాలు లాలాపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి సీఐ తిరుమలరావు కేసు నమోదు చేశారు. డీఎస్పీ బి.సీతారామయ్య దర్యాప్తు అధికారిగా వ్యవహరించారు. అనంతరం ఆయన కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. నిందితులైన అర్జున్‌రావు, కోటేశ్వరిలపై సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో ఇద్దరికి యావజ్జీవ కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.1,500 జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెలువడింది. ఈ కేసులో సమర్థంగా విధులు నిర్వహించిన పోలీసులను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐలు నరసింహారావు, శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ సీఐ సుబ్రమణ్యం పాల్గొన్నారు.


ప్రశంసాపత్రాలు అందుకున్న డీఎస్పీ, పోలీస్ సిబ్బందితో ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

20, 21 తేదీల్లో బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవం

పెదకాకాని: సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గా 535వ ఉరుసు మహోత్సవాలను ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, దర్గా కార్యనిర్వహణాధికారి షేక్ ముక్తార్ బాషా తెలిపారు. పెదకాకానిలోని దర్గా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దర్గా ఈఓ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో రెండురోజులపాటు బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవాలను సంప్రదాయ పద్ధతిలో నిర్వహిస్తామన్నారు. మహోత్సవాల నిర్వహణకు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యాలయం రూ.11 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. దాతల సహకారం లేకుండా బాబా వారి నిధులతో ఉరుసు నిర్వహిస్తున్నామన్నారు. రెండు రోజులపాటు భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ, తాగునీరు, బ్యాండు మేళాలు, సన్నాయి వాయిద్యాల మధ్య బాబా వారి ఉరుసు మహోత్సవం వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్‌హుస్సేన్, వక్ఫ్‌బోర్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ పోలీసు బందోబస్తు

సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గా 535వ ఉరుసు మహోత్సవం సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మంగళగిరి డీఎస్పీ జె రాంబాబు తెలిపారు. బాజీబాబా దర్గాను డీఎస్పీ రాంబాబు, పెదకాకాని సీఐ బండారు సురేష్ బాబులు మంగళవారం సందర్శించారు. జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషా, స్థానిక పెద్దలతో కలసి ఉరుసు నిర్వహణ, ఏర్పాట్లు, భక్తుల అంచనా వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్‌హుస్సేన్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ జిలాని, డైరెక్టర్ సయ్యద్ సుభాని, దర్గా సిబ్బంది సత్తార్, రఫీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషా

నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలతో వి.టీచ్ ఒప్పందం

గుంటూరుఎడ్యుకేషన్: అంతర్జాతీయ పరీక్షల శిక్షణ, అబ్రాడ్ కౌన్సెలింగ్‌లో విశేష అనుభవం ఉన్న వి.టీచ్ సంస్థతో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసకుమార్ తెలిపారు. గుంటూరులోని కళాశాల నగర కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వి.టీచ్ సంస్థ సీఈవో గోసాల అలెగ్జాండర్‌తో ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. అలెగ్జాండర్ మాట్లాడుతూ ఐఎల్ట్స్, టోఫెల్, గ్రే పరీక్షలకు సమగ్రమైన శిక్షణ కల్పించడంతోపాటు కౌన్సెలింగ్ ద్వారా విదేశాల్లో ఉన్నత అభ్యసించేందుకు పూర్తిస్థాయిలో శిక్షణ అందిస్తామని తెలిపారు. శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు వీలుగా వారి కలలను నిజం చేసేందుకు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఫైనాన్స్ అధికారి డాక్టర్ సాయిలక్ష్మి, వి.టీచ్ మార్కెటింగ్ హెచ్ అభిషేక్, హెచ్‌వోడీ పుష్పరాజ్ పాల్గొన్నారు.


ఒప్పందం కుదుర్చుకున్న శ్రీనివాసకుమార్, అలెగ్జాండర్

డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటే లక్ష్యం

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు

మంగళగిరి : డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటే లక్ష్యంగా రాష్ట్ర గ్రంథాలయ సంస్థ పని చేస్తుందని గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు పేర్కొన్నారు. మంగళవారం మంగళగిరిలోని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ కార్యాలయంలో వివిధ జిల్లాల చైర్మన్లు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రంథాలయాలన్నింటికీ నూతన సొంత భవనాలు నిర్మాణానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. గ్రంథాలయ పరిషత్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించి వారిని ఆకట్టుకునేలా పలు కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

జాతీయ స్థాయిలో మెరిసిన తెలుగు తేజం

దర్శి: ఇండియన్ పారాలింపిక్ సిట్టింగ్ వాలీబాల్ భారత్ జట్టుకు పురుషుల జట్టు తరపున దర్శికి చెందిన వేల్పుల విజయ్‌కుమార్ ఎంపికయ్యారు. వరల్డ్ పారా సిట్టింగ్ వాలీబాల్ ఏషియన్ చాంపియన్ షిప్ 2023కు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి విజయ్‌కుమార్ ఒక్కడే ఎంపికయ్యారు. జూన్ 30 నుంచి జూలై 9వ తేదీ వరకు కజకిస్థాన్‌లో ఈ పోటీలు జరగనున్నాయి. విజయ్‌కుమార్ గుంటూరు జీజీహెచ్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తూ క్రీడల్లో పాల్గొంటున్నాడు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి తల్లి సంరక్షణలో పెరిగి పెద్దయ్యాడు. క్రీడలపై విజయ్‌కుమార్‌కు ఉన్న ఆసక్తిని చూసి స్తోమత లేకపోయినా తల్లి ప్రోత్సహిస్తూ వస్తోంది. విజయ్‌కుమార్‌కు ఆల్‌ఇండియా పారాలింపిక్ సిట్టింగ్ వాలీబాల్ ప్రెసిడెంట్ ఎం.చంద్రశేఖర్, పలువురు అభినందనలు తెలిపారు.


విజయ్‌కుమార్‌ను అభినందిస్తున్న చంద్రశేఖర్

ఘనంగా చెన్నకేశవస్వామి 16 రోజుల పండుగ

మాచర్ల: పట్టణంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి దేవాలయంలో మంగళవారం ఘనంగా 16వ రోజు పండుగ నిర్వహించారు. అందులో భాగంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రఘురామిరెడ్డి, చైర్మన్ గోపవరపు నాగేశ్వరరావు, ఈఓ ఐ సాంబయ్యలు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పిఆర్కే స్వామి వారిని దర్శించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించి నియోజకవర్గ, పల్నాడు ప్రజలందరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు. ముందుగా స్వామి దంపతులకు పవళింపు సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రభుత్వ విప్ పీఆర్కే, అర్చకులు, ఆలయ కమిటీ వారు ఆహ్వానించారు. స్వామి వారి ఆశీస్సులుండాలని ఆకాంక్షిస్తూ సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ పీఆర్కే, మున్సిపల్ చైర్మన్ రఘురామిరెడ్డి, చైర్మన్ గోపవరపు నాగేశ్వరరావు, ఈఓ ఐ సాంబయ్య, ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.


అన్నదానం ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

నేడు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

నరసరావుపేట: రంజాన్ పర్వదినాలను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఆరుగంటలకు ప్రకాష్‌నగర్‌లోని షాదీఖానాలో నిర్వహించే ఇఫ్తార్ కార్యక్రమానికి చెందిన ఏర్పాట్లను మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావుతో మాట్లాడుతూ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమానికి సినీ చలనచిత్ర నటుడు ఆలీ హాజరవుతున్న విషయం విదితమే. జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి తోపాటుఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి హాజరుకానున్నారు. నియోజకవర్గంలోని ముస్లింలు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.